క్లుప్తంగా

ఆర్థికసాయం



కన్నాయిగూడెం: ఊపిరితిత్తుల సమస్యతో వరంగల్‌లోని ఓ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న అనగొంది కీర్తనకు ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు బాసటగా నిలిచి ఆర్థికసాయం చేశారు. వరంగల్ జిల్లా పరకాలకు చెందిన అనగొంది సారయ్య కూతురు కీర్తన ఊపిరితిత్తుల సమస్యతో హనుమకొండలోని అమృత హాస్పటల్‌లో వైద్యం పొందుతోంది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతలు ఆదుకోవాలని కోరగా స్పందించిన టీమ్ సభ్యులు కీర్తనకు రూ.14 వేలు ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. పైజొద్దీన్, వనం ప్రకాష్,హామీర్, అహేమద్ తదితరులు పాల్గొన్నారు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పద్మశాలి పరపతి సంఘం సభ్యురాలు కందగట్ల సౌందర్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. సోమవారం సంఘ సభ్యులు రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. సంఘం అధ్యక్షుడు ప్రకాశం ఉన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



వాజేడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్లను నిర్మించా రు. ప్రజలు బహిర్భూమికి బయటకు వెళ్లకుండా వీటిని ఉపయోగించడం కోసం నిర్మించా రు. కానీ వాటిని నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ఉపయోగించకుండా తాళాలను వేసి ఉంచారు. దీంతో సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

అదుపు తప్పి లారీ బోల్తా



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గుండ్లవాగు సమీపంలో లోడుతో వస్తున్న లారీ టైర్లు పేలి అదుపు తప్పి బోల్తా కొట్టింది. వివరాలలోకి వెళ్లితే... పస్రాలోని గుండ్లవాగు సమీపంలో ఇసుక లోడుతో వస్తున్న టీఎస్ 07యూసీ 0099 నంబర్ గల లారీ కుడి, ఎడమ టైర్లు పేలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. బోల్తా పడిన సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. లారీడ్రైవర్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.

గుడుంబా పట్టివేత



వెంకటాపురం(కె): మండలంలోని నూగూరు శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు గుడుంబాను బైక్‌పై తరలిస్తుండగా సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు. ఆరు ప్లాస్టిక్ కవర్లలో ఛత్తీస్‌గఢ్ నుంచి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. 110 లీటర్ల గుడుంబా సుమారు రూ.44 వేలు విలువ ఉంటుందన్నారు. గొల్లగూడెం గ్రామానికి చెందిన సల్సాల రవి, ఉప్పేడుకు చెందిన బొల్లె వినోద్‌కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు. వారి వద్ద గుడుంబా, బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ములుగు రూరల్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన ఈగ శివ(25) గత నాలుగు రోజుల క్రితం తండ్రి మందలించాడనే నెపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేయగా కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

గుంతలమయంగా రోడ్లు

- వర్షాలకు రోడ్లపై నిలిచిన నీరు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రేగొండ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు రోడ్లపై నీరు నిలుస్తుండటంతో గుంత ఎక్కడుందో తెలియక అదుపుతప్పి కింద పడుతున్నారని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు గుంతలరోడ్లకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పరకాల– కనిపర్తి రోడ్డు..

మండలంలోని కనిపర్తి నుంచి పరకాల వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు మరమ్మతులు చేయించకపోవడంతో రోడ్డంతా కంకరతేలి, గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండానే చిట్యాల, టేకుమట్ల, కొడవటంచ ఆలయాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



బురదమయంగా కనిపర్తి - పరకాల రోడ్డు

భయంగానే ప్రయాణం..



మా గ్రామం నుంచి పరకాల వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది. ద్విచక్రవాహనంపై రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంది. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు.

- సాదు దేవేందర్, కనిపర్తి గ్రామస్తుడు

మరమ్మతులు చేయించాలి..



కనిపర్తి నుంచి పరకాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలం మొత్తం బురదమయంగా మారింది. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- గొడుగు మోహన్, కనిపర్తి గ్రామస్తుడు



అటెన్షన్ ప్లీజ్

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా ?



చిన్న వర్షం పడితే చాలు రోడ్డంతా జలమయం అవుతుంది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వల్లెకుంట పంచాయతీ పరిధిలోని కొయ్యూరు ప్రధాన రహదారి నుంచి శాలపల్లికి వెళ్లే రోడ్డంతా గుంతలు.. గుంతలుగా ఏర్పడి ఉండడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మల్హర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : అవినాష్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, మల్హర్
ఫోన్‌నంబర్ : 9440818685

సభ్యత్వ నమోదును ముందుకు తీసుకెళ్లాలి

కాటారం: యువజన కాంగ్రెస్ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న సభ్యత్వ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి అధిక సంఖ్యలో నమోదు చేయాలని యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పూసల శశికాంత్ అన్నారు. మండలంలోని విలాసాగర్‌లో సోమవారం యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మంత్రి శ్రీధర్‌బాబు, యువ నాయకుడు శ్రీనుబాబు బలపర్చిన ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో కాటారం మండలాన్ని సభ్యత్వ నమోదులో ప్రథమంగా నిలపాలని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కాపారబోయిన సందీప్, అట్టెం హరీశ్, సాయి, షేక్ అంజాద్, షేక్ అన్సర్, షేక్ ఫాజిల్, షేక్ కైపుద్దిన్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న శశికాంత్, యూత్ నాయకులు

బాధిత కుటుంబాలకు చేయూత

టేకుమట్ల: మండలంలోని వెలిశాల, రామకిష్టాపూర్(వి) గ్రామాలకు చెందిన బొడ్డు ఎల్లమ్మ, ముత్యాల లింగయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్‌లు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు వైనాల రవీందర్, కత్తి సంపత్‌గౌడ్, చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, బండి రవీందర్, సాంబయ్య, శాస్త్రాల కిరణ్, మొల్లికొండ చిన్న రాజయ్య, పొల్సాని కుమార్, బోయిని తిరుపతి, దేవేందర్‌రావు, తదితరులు న్నారు.

మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు(బెస్తగూడెం)లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. ఈ సంఘటనలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన రెబ్బల రాములు కుటుంబానికి దాతలు తమ వంతు చేయూతనందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గార ఆనంద్, మండల అధ్యక్షుడు గారపు రాంప్రసాద్, ఆ సంఘ నాయకులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి రూ 2,000 నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ప్ర మాదం జరిగిన విషయం తెలుసుకుని వెంటనే బాధిత కుటుంబాన్ని ఎస్సై టీవీఆర్ సూరి పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు తిరుపతి, రాంబాబు, రమేశ్, రఘుబాబు, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా యూత్



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితుడు రాములు కుటుంబానికి గ్రామ యూత్ కమిటీ అండగా నిలిచింది. సోమవారం ఆ కుటుంబానికి అవసరమైన వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, బియ్యం, పప్పులు, నూనె, దుస్తులు, దుప్పట్లు కుటుంబానికి సరిపడా అందచేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో నరేష్, పూర్ణ, సర్వేశ్, చంటి, ప్రశాంత్, రమేశ్, ఆదర్శ్, స్టాలిన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు అలాగే బాధిత కుటుంబానికి పలువురు దాతలు సోమవారం ఆర్థికసాయం అందచేశారు. బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తాటి కృష్ణ, మంగపేట పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, డైరెక్టర్ లక్ష్మన్‌రావు సోమవారం పరామర్శించారు. .

జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని జంపన్న చారిటబుల్ ట్రస్ట్, బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ నాయకులు భూక్యా జంపన్న ఆదేశాలతో యన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాదిత కుటుంబాన్ని పరామర్శించి వారి వంతు సాయంగా నిత్యావసర సరుకులు, కొంత సామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఏటూరునాగారం ఇన్‌చార్జ్ ఎంపెల్లి రాజు, పాల్గొన్నారు.

రైతు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

ఏటూరునాగారం : తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి ప్రధానరోడ్డుపై రైతు రుణమాఫీపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు సారయ్య మాట్లాడుతూ రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ ఇచ్చి ఎన్నికల తర్వాత రైతుల రుణమాఫీపై లేనిపోని నిబంధనను విధించి రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. రైతులను బ్యాంకులు, రైతు వేదికల చుట్టూ తిప్పించుకుంటున్నారు. రూ. రెండు లక్షలకు పైబడి ఉన్న రైతులను ఆపై ఎంత వడ్డీ ఉన్నా చెల్లించాలనే మాటను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రస్తుతం ఖరీఫ్ పంటల పెట్టుబడి సమయం అయినందున రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పులు కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుత ఉన్న పరిస్థితుల్లో రైతులు వడ్డీలు చెల్లించలేక పోయారు. కానీ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని నిబంధన పెట్టడం సరికాదన్నారు.

కాళేశ్వరాలయం గోపురం మీదుగా ఇంద్రధనస్సు



ఆకాశంలో హరివిల్లు!

మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం పడమర గోపురం మీద సోమవారం ఇంద్రధనుస్సు విరిసింది. వర్షం కురిసిన తర్వాత ఎండ కాయడంతో ఒక్కసారిగా గోపురం మీద హరివిల్లు కనివిందు చేసింది. భక్తులు ఈదృశ్యాన్ని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

- కాళేశ్వరం

మల్హర్: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిట్యాల : జూకల్‌లోని వేంకటేశ్వర ఆలయంలో..



మల్హర్ : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో..



ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రంలో, ఆయా గ్రామాల్లో వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. యువత కేరింతలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో రంగునీళ్లు చల్లుతుండగా ఉట్టి కొట్టే కార్యక్రమం కొనసాగింది. అంతకముందు శ్రీకృష్ణుడికి పురోహితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన కూడలిలో పుర వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. ఉట్టి కొట్టిన యువకులకు బహుమతులు అందజేశారు. తమ చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించుకొని తల్లిదండ్రులు మురిసిపోయారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



కాళేశ్వరం : సూరారంలోని ఎస్‌ఎస్‌వీఎం పాఠశాలలో వేషధారణల్లో చిన్నారులు



కాటారం : యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొడుతున్న యువకులు



టేకుమట్ల : సోమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో...



కాటారం : ఆదర్శనగర్ కాలనీలో..



భూపాలపల్లి అర్బన్ : బహుమతులు అందజేస్తూ..

నేడు కృష్ణ మందిర్‌లో వేడుకలు

భూపాలపల్లి అర్బన్: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నేడు (మంగళవారం) జిల్లాకేంద్రంలోని కృష్ణా కాలనీలోని శ్రీ రాధాకృష్ణ గీతా మందిర్‌లో నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ నాయకులు తెలిపారు. ఉదయం 9గంటలకు గో పూజ, 10గంటలకు పంచామృతాల అభిషేకం, సాయంత్రం నాలుగు గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉందని తెలిపారు. ఉట్టి కొట్టిన వారికి ప్రోత్సాహక ప్రథమ బహుమతి రూ.5,016, ద్వితీయ బహుమతి రూ.2,016 ఇవ్వనున్నట్లు తెలిపారు.

కాళేశ్వరాలయంలో..

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి అనుబంధ దేవాలయం రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం రాత్రి 8గంటలకు ప్రారంభం కానున్నట్లు ఈఓ మారుతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి ఉత్సవ విగ్రహాలతో గోపాల కాల్వలు నిర్వహిస్తారు. అనంతరం రామాలయం వద్ద ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, పాల్గొని ప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవ పూజలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్‌లో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవ కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థాన ఆచార్యులు పరశారం భావనారాయణ చార్యులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు హాజరై పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాటారం : మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి(353 సీ)పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మల మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన నరసింహస్వామి ద్విచక్రవాహనదారుడు రోడ్డుపై తీవ్రగాయాలతో పడిపోయి ఉన్నాడు. అటు వైపుగా వెళ్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. నరసింహస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియరాలేదు.



గాయపడిన నరసింహస్వామి

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

రేగొండ(కొత్తపల్లిగోరి): రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ సింహాలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల నుంచి ఒంటరిగా బయటికి రావాలంటే జనం జంకుతున్నారు. రాత్రివేళ వాటి అరుపులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా కోతుల బెడదతో చిన్నాపెద్దలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

